## క్లుప్తంగా

### వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



**మాక్లూర్:** మండలంలోని మాణిక్‌బండార్ చౌరస్తా వద్ద గురువారం అరుణోదయ సంస్కృతి సమాఖ్య రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా నాయకుడు దుడ్డు గంగాధర్ మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా నర్సంపేటలో డిసెంబర్ 8న రాష్ట్ర జనరల్ కౌన్సిలింగ్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో భవిషత్ కార్యక్రమాల రూపకల్పన కోసం చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా నుంచి ప్రజలు, కళాకారులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమాఖ్య సభ్యులు అబ్బన్న, శంకర్, రామకృష్ణ, లక్ష్మన్ పాల్గొన్నారు.

### విగ్రహ ఏర్పాటుకు స్థలం ఇవ్వండి



**ఆర్మూర్‌టౌన్:** పట్టణంలో స్వామి వివేకానంద విగ్రహ ఏర్పాటు కోసం స్థలాన్ని కేటాయించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈమేరకు వారు గురువారం ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. వివేకానంద విగ్రహ ఏర్పాటుకు విద్యావంతులు, ప్రజలు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. నాయకులు జెస్సు అనిల్, సుంకరి రంగన్న, మిరియాల్కర్ కిరణ్, మందుల పోశెట్టి, అంతాజీ హజారి శ్రీనివాస్, పీర్ సింగ్, దక్షిణ మూర్తి, రాము, సాయన్న పాల్గొన్నారు.

### మహిళల భద్రత కోసమే షీటీమ్

**ఆర్మూర్‌టౌన్:** మహిళ భద్రత కోసమే షీటీం పనిచేస్తోందని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు, బాలికలు, యువతులు వేదింపులకు గురైతే షీటీం నెంబర్ 8712659797, అత్యవసర సమయంలో డయల్100, ఆన్‌లైన్ మోసాలకు గురైతే టోల్ ఫ్రీ నెంబర్1930కు ఫోన్ చేయాలన్నారు. ప్రిన్సిపాల్ నుశ్రత్ జహాన్, కళా బృందం, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


### సమస్యలు పరిష్కరించాలి

**రుద్రూర్:** తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో గురువారం కోటగిరి తహసీల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్ కార్యాలయంలో అందజేశారు. ఈసందర్భంగా వేదిక జిల్లా కార్యదర్శి ఏశాల గంగాధర్ మాట్లాడుతూ.. డిమాండ్ల సాధనకు ఈ నెల 30న బోధన్ ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించే ఒక రోజు రిలే నిరాహార దీక్షకు తరలిరావాలని దివ్యాంగులకు పిలుపునిచ్చారు. ఎన్‌పీఆర్డీ మండల అధ్యక్షుడు కుర్లం సాయిలు, కార్యదర్శి శివకుమార్, సభ్యులు వెంకట్రావ్, రాజ్‌కుమార్, శ్రీను, లక్ష్మణ్, సుమలత, శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

### బదిలీలు వెంటనే చేపట్టాలి

**బాల్కొండ:** జెన్‌కోలో బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని ఇంజినీర్లు, సిబ్బంది డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పోచంపాడ్ జెన్‌కో కార్యాలయంలో ఇంజినీర్లు సీఈ రమేశ్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రామగుండంలో నూతనంగా నిర్మిస్తున్న పవర్ ప్లాంట్‌ను సింగరేణికి సంబంధం లేకుండ జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇంజినీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### దీక్ష దివస్‌ను జయప్రదం చేయాలి



**ఆర్మూర్‌టౌన్:** జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించే దీక్ష దివస్‌ను జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ అన్నారు. పట్టణంలో గురువారం బీ ఆర్‌ఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు దీక్షదివస్ నిర్వహిస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు. నా యకులు పోల సుధాకర్, మీరా శ్రావణ్, అగ్గిక్రాంతి, రాజు, అఖిల్ పాల్గొన్నారు.

# లైట్లు వెలిగేదెప్పుడు?

- ఎస్సారెస్పీ రోడ్డులో పనిచేయని వీధిదీపాలు
- డివైడర్, సెంట్రల్ లైటింగ్ కోసం రూ.కోటి నిధులు మంజూరు
- టెండర్ నిర్వహించినా.. ఇప్పటికీ పనులు ప్రారంభించని అధికారులు



ఎస్సారెస్పీ రోడ్డు వద్ద వెలగని లైట్లు

**బాల్కొండ:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద గల జాతీయ రహదారి 44నుంచి ప్రాజెక్ట్ వరకు ఉన్న రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన లైట్లు వెలిగేదెప్పుడు అంటు కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. రహదారి నుంచి ప్రాజెక్ట్ వరకు లైటింగ్ పనులు 2014లో పూర్తి చేసి ప్రారంభించారు. అప్పటి నుంచి నిర్వహణ సరిగా లేకపోవడంతో లైట్లు మొత్తం పాడైపోయాయి. వాటి మరమ్మతుల కోసం ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో గత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో రూ.28 లక్షల నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు ప్రారంభించక ముందే రహదారి నుంచి ప్రాజెక్ట్ వరకు రోడ్డు డివైడర్ నిర్మించి, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని అప్పటి పాలకులు రూ.1.06 కోట్ల నిధులను మంజూరు చేశారు. టెండర్ ప్రక్రియ కూడ పూర్తి చేశారు. కానీ పనులు మాత్రం ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. దీంతో సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో ఆ రోడ్డు అంధకారంలోనే మగ్గుతుంది.

**కాంట్రాక్టర్ మృతిచెందడంతో..**

రోడ్డు డివైడర్, సెంట్రల్ లైటింగ్ కోసం ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రూ.1.06 కోట్ల నిధులతో టెండర్ నిర్వహించారు. కానీ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ మృతి చెందాడు. దీంతో పనులు ముందుకు సాగలేదని ప్రాజెక్ట్ అధికారులు అంటున్నారు. టెండర్ రీకాల్ చేసి పనులను వెంటనే ప్రారంభించాలనీ కాలనీవాసులు వేడుకుంటున్నారు. రోడ్డు పూర్తిగా అంధకారంలో ఉండటంతో పలుమార్లు ప్రమాదాలు జరిగి కాలనీవాసులు మృత్యువాత పడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పనులు ప్రారంభించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## నిర్వహణ సమస్య.. ..

జాతీయ రహదారి నుంచి ప్రాజెక్ట్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసిన తర్వాత వాటి నిర్వహణ ఎవరు చేపట్టాలనే సమస్య తలెత్తింది. గ్రామ పంచాయతీనే నిర్వహణ చేపట్టాలని ఇరిగేషన్ శాఖ పేర్కొనగా, ప్రాజెక్టు కాలనీ నుంచి ఎలాంటి ఆదాయం జీపీకి రావడం లేదు. కావున ఇరిగేషన్ వారే చేపట్టాలని జీపీ సభ్యులు పేర్కొంటున్నారు. దీంతో పనులు ముందుకు సాగలేదు. లేదంటే పనులు ఎప్పుడో పూర్తయ్యేవని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ ఈ సమస్య పరిష్కారం కావడం లేదు.

**త్వరలో ప్రారంభిస్తాం..**

సెంట్రల్ లైటింగ్, రోడ్డు డివైడర్ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ మృతి చెందడంతో పనులు ప్రారంభం కాలేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. – అక్తర్, ఏఈఈ, ఎస్సారెస్పీ

# ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



రమేష్, తహసీల్దార్ ఆలూర్

**పెర్కిట్(ఆర్మూర్):** త్వరలో జరగబోయే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడానికి టీచర్లు, పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆలూర్ తహసీల్దార్ రమేష్ సూచించారు. ఆలూర్‌లోని తహసీల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నేటి నుంచి డిసెంబరు 9వరకు దరఖాస్తు గడువును పొడగించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఫామ్–19తో పాటు పీపీ సైజ్ ఫోటో, పాఠశాల ఉద్యోగ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు ధ్రువ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే పట్టభద్రులు ఫామ్–18తో పాటు పీపీ సైజ్ ఫోటో, డిగ్రీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, ఎన్నికల గుర్తింపు కార్డు జిరాక్స్ ప్రతులను జత చేసి తహసీల్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.



నందిపేటలో మాట్లాడుతున్న రాజారాం యాదవ్

### అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

**నందిపేట్(ఆర్మూర్):** అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఉస్మానియా విశ్వవిద్యాలయ జేఏసీ వ్యవస్థాపకుడు రాజారామ్ యాదవ్ సూచించారు. మండల కేంద్రంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాల, కృష్ణవేణి పాఠశాలలో గురువారం పట్టభద్రుల ఓటు హక్కు నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారామ్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన విద్యార్థి ఉద్యమ నాయకుడైన తనను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించి చట్టసభలకు పంపాలని కోరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, నాయకులు, ఓయు విద్యార్థి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం..

### అయ్యప్ప స్వాముల మాలధారణ



**పెర్కిట్(ఆర్మూర్):** మామిడిపల్లి అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం గురు స్వాములు సాక్కల శ్రీనివాస్, నంబి నరేష్ ఆధ్వర్యంలో పలువురు భక్తులు మాలధారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీడీసీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నలంద ప్రసాద్, లిల్లిపుట్ రామకృష్ణ, యోగిత్ రెడ్డి, నితిన్, స్వామి, ప్రశాంత్, భార్గవ్, సాక్కల తిరుపతి పాల్గొన్నారు.

### 1100 కి.మీ పూర్తయిన అయ్యప్ప స్వాములు పాదయాత్ర



**రుద్రూర్:** మండల కేంద్రం నుంచి శబరిమల పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా బయలు దేరిన అయ్యప్ప స్వాములు 1100 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేశారు. గురువారం తమిళనాడు రాష్ట్రంలోని సెలం వద్ద ఉన్నట్లు వారు తెలిపారు. పాదయాత్రలో స్వాములు ప్రసూన్‌కుమార్ , శ్రావణ్, అనిల్, సుభాష్, రాజు ఉన్నారు.

### ఘనంగా బోనాల పండుగ



**కమ్మర్‌పల్లి:** మండలంలోని ఉప్లూర్‌లో గురువారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతల బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బోనాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. తీసుకెళ్లారు. అనంతరం ఆలయంలో అమ్మవార్లకు బోనాలను సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. వీడీసీ అధ్యక్షుడు సోమ దశరత్, సభ్యులు సుంకరి విజయ్, బద్దం రమేష్, బోనగిరి రాజేశ్వర్, సాంబారు అశోక్, చింతకుంట శ్రీను, నరేందర్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం





వేల్పూర్‌లో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ముత్యంరెడ్డి, డైరెక్టర్లు.. కమ్మర్‌పల్లిలో..

**వేల్పూర్:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని వేల్పూర్ ఏఎంసీ ఛైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్ ఏఎంసీ వద్ద గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులు ఎల్లప్పుడు ఆనందంగా ఉండాలని రుణమాఫీ, సన్నరకం వడ్లకు బోనస్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేశారన్నారు. రైతుబంధు పేరుతో గత ప్రభుత్వం వెంచర్లకు, గుట్టలకు, పడావు భూములకు సైతం డబ్బులు ఇచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. ఈక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగులో ఉన్న భూమిని క్రమబద్ధీకరిస్తోందన్నారు. అందుకే రైతు భరోసా ఆలస్యం అవుతోందన్నారు. రైతులకు మేలు చేయాలనే ఆలోచనతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ పనిముట్ల యాంత్రీకరణపై, డ్రిప్ ఇరిగేషన్‌పై సబ్సిడీ ఇచ్చే ప్రణాళిక సిద్ధ చేస్తున్నారన్నారు. డైరెక్టర్లు జైడి రవి, నరేందర్, కిషన్‌గౌడ్, బొంబాయి గంగాధర్, ఇమ్రాన్, గంగాధర్ పాల్గొన్నారు.

**కమ్మర్‌పల్లిలో..**

**కమ్మర్‌పల్లి:** రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సయ్య పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల వేల ఇచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ ప్రజాపాలన పట్ల రైతులు విశ్వాసంతో ఉన్నారని తెలియజేశారు. వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, నాయకులు వేముల గంగారెడ్డి, రాజేశ్వర్, మనోజ్, సింగిరెడ్డి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా స్థాయి సైన్స్ పోటీల్లో ప్రతిభ

**బోధన్:** నగరంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక అధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో సాలూర గురుకుల విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ మహేశ్వరీ తెలిపారు. ఈసందర్భంగా గురువారం విద్యార్థినులు మంజుల, పవిత్ర, క్రిష్ణవేణిలను ఉపాధ్యాయులు అభినందించారు.

## సంక్షిప్తం

### 'సింహగర్జన'కు తరలిరావాలి

**అర్మూర్‌టౌన్:** హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించనున్న మాలల సింహగర్జన సభకు మాలలు తరలిరావాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సమితి రాష్ట్ర కో-చైర్మన్ అంగరి ప్రదీప్ మాట్లాడుతూ.. మాలల అభివృద్ధికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్న రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పేందుకు, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను అడ్డుకునేందుకు ప్రతి మాల బిడ్డ తరలిరావాలని కోరారు. నాయకులు అర్గుల్ సురేష్, ముత్తెన్న, పులిసాయిరాం, మాదరి రాజన్న, కండె కిరణ్, సుమన్ పాల్గొన్నారు.


### అమరవీరులకు నివాళులు

**ఎడపల్లి(బోధన్):** మండలంలోని ఏఆర్పీ క్యాంప్ గ్రామంలో గురువారం బోధన్ షుగర్ ఫ్యాక్టరీ కార్మిక అమరవీరులకు ఎస్ఎస్ఎఫ్ కార్మిక సంఘం నాయకులు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 1959లో ఫ్యాక్టరీ యజమాన్యానికి, కార్మికులకు మధ్య జరిగిన ఉద్యమంలోపోలీస్ కాల్పుల్లో ముగ్గురు కార్మికులు రాజయ్య, రామయ్య, రాము అమరులయ్యారన్నారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది నవంబర్ 28న వారికి నివాళులు అర్పిస్తున్నామన్నారు. నాయకులు ఉపేందర్, తోట రాజశేఖర్, పుల్కా స్వామి, నర్సింలుగౌడ్, రాజు, రమేష్, సంజీవ్, వినోద్ పాల్గొన్నారు.

### ఎల్‌వోసీ అందజేత

**పెర్కిట్(ఆర్మూర్):** ఆర్మూర్ మండలం అందాపూర్ గ్రామానికి చెందిన గంగారాంకు వైద్య చికిత్స కోసం రూ.లక్ష 50వేల ఎల్‌వోసీని గురువారం అర్మూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నారెడ్డి అందజేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### రామాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**రుద్రూర్:** మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి గురువారం వర్ని మండలం తగిలేపల్లి గ్రామానికి చెందిన గంగా వెంకటేశ్వర్ రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. పత్తి రాము, బచ్చు పవన్, పత్తి నవీన్, అడ్ప నవీన్ తదితరులు ఉన్నారు.

### జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక

**బోధన్:** సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన కుమ్మరి పోశెట్టి రాష్ట్ర ఐకేపీ వీవోఏల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో గురువారం వీవోఏల యూనియన్ సమావేశం నిర్వహించారు. జేఏసీ ఏర్పాటు చేసుకొని కమిటీని ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

### విద్యార్థులకు ముగ్గుల పోటీలు

**బాల్కొండ:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం వైఆర్‌జీ కేర్ సంస్థ ఆధ్వర్యంలో ఏయిడ్స్ దినోత్సవాన్ని పురష్కరించుకుని విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈవో రాజేశ్వర్, సంస్థ కోఆర్డినేటర్ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఏఈఈ మృతిపై సంతాపం

**బాల్కొండ:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ పరిధిలోని మెట్‌పల్లి డివిజన్ ఏఈఈ మహ్మద్ ఇబ్రహీం అనారోగ్యంతో మృతి చెందడంతో గురువారం ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ఉద్యోగులు రెండు నిమిషాలు మౌనం పాటించి, సంతాపం తెలిపారు. డిప్యూటీ ఈఈలు, ఏఈఈలు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థినికి అభినందన

**రెంజల్(బోధన్):** రెంజల్ ఆదర్శ పాఠశాల విద్యార్థిని మాలతి ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి మూడోస్థానంలో నిలిచి కాంస్యపతకం సాధించింది. ఈసందర్భంగా గురువారం పాఠశాలలో విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు. ప్రిన్సిపాల్ ఫిరోజ్‌హైదర్, పీడీ బలరాం ఉన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలోని మిసిమి హైస్కూల్ విద్యార్థిని నేహా రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ బాలి రవీందర్ తెలిపారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నేహాను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**బాల్కొండ:** ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామంలో పలువురి బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ముత్యం రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జక్క రాజేశ్వర్, నాయకులు గంగాధర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ముప్కాల్ మండలంలో..

**బాల్కొండ:** ముప్కాల్ మండలంలోని పలు గ్రామాల బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం బీఆర్‌ఎస్ నాయకులు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, నాయకులు బద్దం నర్సారెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి కృషి చేయాలి





బోధన్‌లో మాట్లాడుతున్న ఎంఈవో నాగయ్య.. పాల్గొన్న వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు

**బోధన్:** ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవో నాగయ్య అన్నారు. పట్టణంలోని డివిజన్ డిప్యూటీ డీఈవో కార్యాలయంలో గురువారం వివిధ విద్యా ప్రణాళికల అమలు తీరుపై మండలస్థాయి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో సామర్థ్యాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టితో కృషి చేయాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్( ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ), ఎల్ఐపీ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్) ప్రోగ్రాంలు పటిష్టంగా అమలు చేసి మంచి ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఖచ్చితంగా సమయ పాలన పాటించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన వివరాలు ప్రతిరోజు ఉదయం 11గం.ల లోపు తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. హెచ్‌ఎంలు సూర్యకుమార్, రత్నాకర్, ఆరిఫోద్దీన్, సీఆర్‌పీలు విజయ్, బాబు, యూసుఫ్, విజయరేఖ, శివానందం పాల్గొన్నారు.

### ఆధార్ అప్‌డేట్ పూర్తి చేయాలి



బాల్కొండలో మాట్లాడుతున్న ఎంఈవో రాజేశ్వర్

**బాల్కొండ:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆధార్ అప్‌డేట్‌ను రెండు రోజుల్లో పూర్తి చేయాలని బాల్కొండ ఎంఈవో రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 4న జరిగే జాతీయ సాధన సర్వే పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. జీవీఈపీ నూరు శాతం పూర్తి చేయాలన్నారు. రాజ్యాంగ వజ్రోత్సవాలను ఏడాదిపాటు నిర్వహించాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

### వరి నారుమడుల పరిశీలన



**కమ్మర్‌పల్లి:** మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం వ్యవసాయాధికారులు వరి నారుమడులను పరిశీలించారు. వరినారు ఎర్రబడడాన్ని గుర్తించారు. రైతులకు నివారణ చర్యలను సూచించారు. నారుమడిలో సాయంత్రం నీటిని తొలగించి, మరుసటి రోజు ఉదయం నీటిని అందించాలని రైతులకు సూచించారు. చలి తీవ్రత నుంచి నారును కాపాడుకోవడానికి టార్పాలిన్ కవర్ కప్పి ఉంచుకోవాలని సూచించారు.

### జ్యోతిబాపూలేకు ఘన నివాళి

**ఆర్మూర్‌టౌన్:** పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం జ్యోతిబాపూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పూలే చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. డివిజన్ కార్యాదర్శి పల్లపు వెంకటేష్, నాయకులు సాయిలు, కుల్దీప్‌శర్మ, ఓంకార్, జాదవ్‌రాజు, కుమార్ పాల్గొన్నారు.

## వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)**

- స్క్రీన్-1 – ఉక్కు సత్యాగ్రహం(తెలుగు)-10.30, ఝాన్సీ ఐపీఎస్(తెలుగు)-1.30, మోనా-2 (ఇంగ్లీష్)-4.50 7.15 9.40
- స్క్రీన్-2 – రోటి కపడా రొమాన్స్ (తెలుగు) - 12.05 6.15 భైరతి రణగల్ (తెలుగు) - 3.20 9.30
- స్క్రీన్-3 – కేశవ చంద్ర రమావత్ (కేసీఆర్) -తెలుగు- 12.50 లక్కీభాస్కర్ (తెలుగు) - 3.45 7.00 జీబ్రా (తెలుగు) - 10.15
- స్క్రీన్-4 – అమరన్(తెలుగు)-11.20 2.50 6.20 9.50

**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

- స్క్రీన్-1 అమరన్(తెలుగు)-10.25, భైరతి రణగల్(తెలుగు)-1.30,7.35, రోటి కపడా రొమాన్స్ - 4.30 10.30
- స్క్రీన్-3 మోనా-02(ఇంగ్లీష్ 3డీ)-11.00, 7.35, అమరన్(తెలుగు)-1.25,10.30, ది సబర్మతి రిపోర్ట్-4.30

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

- స్క్రీన్-1 అమరన్ (తెలుగు) - 12.00, 3.30, 7.00, 10.30
- స్క్రీన్-2 మోనా-2(3డీ ఇంగ్లీష్)-11.00,1.25, 6.45, 9.10, కేశవ చంద్ర రమావత్(కేసీఆర్)-తెలుగు-3.50
- స్క్రీన్-3 ఝాన్సీ ఐపీఎస్(తెలుగు)-10.25, ఫస్ట్ కేస్ ఆఫ్ ఉద్వేగం(తెలుగు)-1.45, భైరతి రణగల్(తెలుగు)-4.30, లక్కీ భాస్కర్(తెలుగు)-7.25, జీబ్రా(తెలుగు)- 10.40
- స్క్రీన్-4 కేశవ చంద్ర రమావత్(కేసీఆర్)-10.05, రోటి కపడా రొమాన్స్-1.00,7.15, ఉక్కు సత్యాగ్రహం(తెలుగు)-4.15, భైరతి రణగల్(తెలుగు)-10.30

- లలితామహల్ భైరతి రణగల్(తెలుగు)
- దేవి జీబ్రా(తెలుగు)-11.15,6.15, మెకానిక్ రాకీ (తెలుగు)-2.15,9.15
- నటరాజ్ అమరన్ (తెలుగు)
- విజయ్ కంగువ 3డీ (తెలుగు)

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 77,300 | వెండి(కిలో) | 94,000 |
| 22 క్యారెట్స్ | 71,317 | – నిజామాబాద్ బిజినెస్ | |

### మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్సడ్ | 200 |
| | | లైవ్ | 140 |
| స్కిన్‌లెస్ | 240 | మటన్ | 800 |

# మండల అధికారులకు సన్మానం



**బాల్కొండ:** ముప్కాల్ రైతు వేదికలో గురువారం ముప్కాల్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారులను సన్మానించారు. 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురష్కరించుకుని సన్మానం నిర్వహించినట్లు వారు తెలిపారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎంపీడీవో ముజాఫరొద్దీన్‌కు నివాళులు అర్పించారు. సమితి అధ్యక్షుడు శ్రీకాంత్, కార్యదర్శి సంజీవ్ థామస్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### బదిలీ అయిన ఉపాధ్యాయులకు..



**కమ్మర్‌పల్లి:** మండలంలోని అమీర్‌నగర్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం గ్రామస్తులు సన్మానించారు. ఎంఈవో ఆంధ్రయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్మూర్ సి. ప్రభాకర్ ACO : 9010585333
నిజామాబాద్ అర్బన్ & రూరల్ జి. రాంనాథ్ : 9849180084
బాల్కొండ ప్రదీప్ : 7893150102
బోధన్ ఎ.శివ : 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899